క్లుప్తంగా

క్రీడాకారుడికి సాయం

చిన్నచింతకుంట: రాష్ట్రస్థాయి పదో అథ్లెటిక్ చాంపియన్ పోటీల్లో విజేతగా నిలిచి మూడు పతకాలు సాధించిన అల్లీపురం వాసి నవీన్‌ను సోమవారం దమగ్నపురంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అభినందించారు. అనంతరం రూ. 20వేల నగదును ఆర్థికసాయంగా అందించారు. నాయకులు దామోదర్ యాదవ్, డి. బాలస్వామి, బి ఆంజనేయులు, జి. నరేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి..

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రానికి చెందిన భీమా మాధురి సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో వైద్య విద్య రెండో సంవత్సరం చదువుతోంది. మాధురి తండ్రి భీమా ఆంజనేయులు రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. చదువు కోసం పెద్ద మొత్తంలో ఖర్చవుతుండటంతో స్థానిక ఆర్యవైశ్య నాయకులు దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డిని కలిసి మాధురి కుటుంబ ఆర్థిక పరిస్థితులను వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తన వంతు సాయంగా రూ.50వేలు అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో భీమా చంద్రకాంత్, శంకర్‌శెట్టి, మెడిశెట్టి రాజు తదితరులు ఉన్నారు.

విద్యార్థినికి సన్మానం

చిన్నచింతకుంట: లాల్ కోటకి చెందిన విద్యార్థిని భాగ్య పదో తరగతిలో 9.3 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచినందుకు.. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు సోమవారం ఆమెను సత్కరించారు. రూ. 5,500 నగదును బహుమతిగా అందజేశారు. హెచ్‌ఎం మురళీకృష్ణ మాట్లాడుతూ భాగ్య ఉన్నత చదువులు చదివి గొప్పగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులత పాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాత్రల పంపిణీ

జడ్చర్ల టౌన్: మండలంలోని కొత్తతండా వద్ద ఉన్న మౌంట్‌బాసిల్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఆర్‌బీఎస్‌కే డాక్టర్లు సునీల్, లీల ఆధ్వర్యంలో ఆశ కార్యకర్త అనిత 1600 మంది విద్యార్థులకు మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డాక్టర్లు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



నవాబుపేట: మండల పరిధిలోని కొల్లూర్ జెడ్పీ పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో తరగతి గదిలో ఉండాల్సిన సార్లు వేరే గదిలో కునుకు తీస్తూ కనిపించారు. ఈ క్రమంలోనే గ్రామానికి చెందిన యువకులు పాఠశాలకు వెళ్లి ఫోన్లో ఫొటో తీశారు. సదరు చిత్రం సోమవారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీనిపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యం తగదని అంటున్నారు. కాగా విషయంపై హెచ్‌ఎం శ్రీకాంత్‌ను వివరణ కోరగా.. బడిలో లీజర్ పీరియడ్ ఉన్నా నిద్రపోవటం సమంజసం కాదన్నారు. తాను వారం రోజుల క్రితమే పాఠశాలకు బదిలీపై వచ్చినట్లు వివరించారు.

ఘనంగా ఉర్సు

దేవరకద్ర: మండల కేంద్రంలో సోమవారం మల్లెబారి సాహెబ్ ఉర్సులో భాగంగా గంధం మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పలువురు ముస్లింలు దర్గాలో ఫాతేహాలు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేడుకల్లో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ నాయకులు అరవింద్‌రెడ్డి, మండల నాయకులు అంజిల్‌రెడ్డి, రాఘువేందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఫారూఖ్, జమీల్ తదితరులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

సమగ్ర చట్టాల కోసం పోరాటం చేద్దాం

నారాయణపేట రూరల్ : వ్యవసాయ కార్మికుల అభ్యున్నతికి సమగ్ర చట్టాలను రూపొందించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ.. దేశంలో 60శాతం వ్యవసాయ రంగాన్ని నమ్ముకుని రైతులు, కూలీలు జీవనం సాగిస్తున్నారని, 14కోట్ల మంది వ్యవసాయ కార్మికులు ఉన్నప్పటికి వారి కోసం సరియైన చట్టాలు లేకపోవడం విచారకరమన్నారు. కనీస వేతనం రూ. 600కు పెంచాలని, ఇంటి నిర్మాణాలకు రూ.5లక్షల రుణం, నాణ్యమైన విద్య, వైద్యం తదితర డిమాండ్లను పరిశీలించాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నర్సింహ, వెంకట్రాములు, నారాయణ, హాజి, మెగలప్ప, హన్మంతు, రాఘవేందర్, సాయిలు, లక్ష్మప్ప, జగ్గప్ప, జనార్దన్, బాలరాజు పాల్గొన్నారు.



‘ప్రజావాణి’కి 109 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేందిర ఇతర అధికారులు

- ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలి
- కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన అర్జీలను అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 109 మంది దరఖాస్తులు అందజేశారు. ఇందులో రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్, పంచాయతీ, పింఛన్లు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమం ఇతర శాఖలకు సంబంధించిన అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లతో కలెక్టర్ మాట్లాడుతూ వారి పరిధిలోకి వచ్చిన దరఖాస్తులను వెంటనే జాప్యం లేకుండా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, డీఆర్‌ఓ రవికుమార్, జెడ్పీ సీఈఓ రాఘవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూలు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక వసతులు కల్పించాలి. అలాగే ప్రైవేట్ స్కూళ్లలో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాంల పేరుతో అక్రమ వ్యాపారం చేస్తూ తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారు. అలాంటి పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు శ్రీధర్, నవీన్‌రెడ్డి, నరేందర్, శ్రీశైలం తదితరులు కోరారు.

బస్ స్టాప్ ఏర్పాటు చేయాలి...

మహబూబ్‌నగర్– జడ్చర్ల జాతీయ రహదారిలో ఉన్న అప్పన్నపల్లి వద్ద బస్ స్టాప్ ఏర్పాటు చేయాలి. గత 50 ఏళ్ల నుంచి ఇక్కడ బస్టాప్ ఉండేది. కానీ, ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణంతో ఉన్న బస్టాప్ పోయి వార్డు ప్రజలకే కాకుండా ప్రయాణికులకు అసౌకర్యంగా ఉంది. వార్డులో ఉన్న సర్వీస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వెంటనే సర్వీస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

– రామాంజనేయులు, 3వ వార్డు కౌన్సిలర్

డీఐఈఓను సస్పెండ్ చేయాలి..

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రైవేట్ కళాశాలల నుంచి డబ్బులు తీసుకుంటూ వాటికి వత్తాసు పలుకుతున్న డీఐఈఓ శ్రీధర్ సుమన్‌ను సస్పెండ్ చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ కళాశాలల్లో అనుమతి లేకుండా హాస్టళ్లు నిర్వహిస్తున్నారని, దీనిపై డీఐఈఓకు ఫిర్యాదు చేసి, కళాశాల ఎదుట ధర్నా నిర్వహిస్తే డీఐఈఓ మాత్రం ఫోన్ స్విచ్చాఫ్ చేసి వెళ్లిపోయారని ఆరోపించారు. ఆయనపై వెంటనే విచారణ చేసి సస్పెండ్ చేయాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఆయా సంఘాల నాయకులు ప్రశాంత్, భరత్, నందు, బాలకృష్ణ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల నిర్వహణపై సమీక్ష



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- నాలుగు గ్రూపులకు అందుబాటులో 240 సీట్లు
- 28 నుంచి దోస్త్ వెబ్ ఆప్షన్
- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

దేవరకద్ర: మండలకేంద్రంలో డిగ్రీ కళాశాల పక్రియ ప్రారంభం అయిందని.. ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం అవుతాయని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం దేవరకద్ర ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద డిగ్రీ, జూనియర్ కళాశాలల అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. డిగ్రీ కళాశాల భవనం పూర్తి అయ్యే వరకు ఈ విద్యా సంవత్సరం తరగతులు జూనియర్ కళాశాల భవనంలోనే కొనసాగించడానికి నిర్ణయించినట్లు తెలిపారు. విషయంపై అధికారులతో చర్చించిటన్లు వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మొట్ట మొదటి డిగ్రీ కళాశాల దేవరకద్రకు కేటాయించడం సంతోషకరమన్నారు. కళాశాల మంజూర్ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఆర్థిక అనుమతులు ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కరకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. మొత్తంగా 240 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ నెల 28 నుంచి దోస్త్ ద్వారా ఆప్షన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ ప్రాంతం విద్యార్థులకు ముఖ్యంగా బాలికలకు ఇబ్బంది లేకుండా కళాశాల ఏర్పాటు చేయబోతుండడం ఆనందకరంగా ఉందన్నారు. టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, డిగ్రీ, ఇంటర్మీడియేట్ కళాశాలల అధికారులు, మండల నాయకులు అరవింద్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, జవహర్, వర్మ, కొండ శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఆది హన్మంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొర్రితండా విద్యార్థులకు అభినందన



విద్యార్థులతో తహసీల్దార్, ఉపాధ్యాయులు తదితరులు

హన్వాడ: మండల పరిధిలోని దొర్రితాండ ప్రాథమిక పాఠశాలలో గురుకులాలకు ఎంపికైన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చదువుకుంటూ గురుకులాలకు ఎంపికవ్వడంపై పలువురు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమానికి తహసీల్దార్ కిష్ట్యనాయక్, ఎంపీపీ బాల్‌రాజు, జెడ్పీటీసీ విజయనిర్మల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ మేరకు విద్యార్థులను అభినందించారు. గురుకులాలకు ఎంపికైన మొత్తం 18 మంది విద్యార్థులను సత్కరించారు. గురుకులాల్లో చేరే విద్యార్థులు ఇదే లక్ష్యంతో ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా తహసీల్దార్ పాఠశాల విద్యార్థుల నోట్‌పుస్తకాలకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజునాయక్, సీఆర్‌పీ కుమార్‌గౌడ్, పాఠశాల హెచ్‌ఎం పుల్లయ్య, ఉపాధ్యాయులు విజయ్‌మోహన్, మల్లేష్ పాల్గొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపులైన్

- ధర్మాపూర్ శివారులో వృథాగా వెళ్తున్న తాగునీరు
- వారం రోజుల క్రితమే చిన్న లీకేజీ ఏర్పడిన వైనం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాంరెడ్డిగూడ పంపుహౌస్ నుంచి పట్టణానికి సరఫరా అయ్యే మిషన్ భగీరథ పథకం పైపులైన్ ధర్మాపూర్ శివారులో మళ్లీ పగిలిపోయింది. వాస్తవానికి వారం రోజుల క్రితమే అక్కడ చిన్న లీకేజీ ఏర్పడినా మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదు. దీంతో సోమవారం నీటి ఉధృతికి పైపులైన్ కాస్తా పగిలి రోడ్డు పక్క నుంచి వృథాగా వెళుతోంది. గతంలోనూ ఇదే ప్రాంతంలో పలుసార్లు లీకేజీలు ఏర్పడగా మరమ్మతు చేశారు. ఈ లైన్ గత 30 ఏళ్లక్రితం నాటిది కావడంతో తరచూ పగిలిపోతోంది. ఈ విషయమై ఏఈ సాయిరాంను వివరణ కోరగా త్వరలోనే దానిని బాగు చేస్తామన్నారు. వెంటనే తాగునీటిని బంద్ చేస్తే పట్టణ ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులను సంప్రదించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.

95 దరఖాస్తుల స్వీకరణ

జడ్చర్ల టౌన్: గృహజ్యోతి పథకంలో భాగంగా జీరోబిల్లులు రాని వారితోపాటు గ్యాస్‌పథకం అర్హులు కాని వారు 95మంది మున్సిపాలిటీలో దరఖాస్తు చేసుకున్నారు. శనివారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండటంతో లబ్దిదారులు పెద్ద సంఖ్యలోనే మున్సిపాలిటీకి చేరుకున్నారు. అయితే సర్వర్ సమస్య కారణంగా 95 దరఖాస్తులు మాత్రమే ఆన్‌లైన్ చేయగలిగారు. దరఖాస్తులు స్వీకరించేందుకు మున్సిపాలిటీ కార్యాలయంలో 2 కౌంటర్లు ఏర్పాటు చేశారు. అయితే నాగసాల, నిమ్మబావిగడ్డ, బూరెడ్డిపల్లి వాసులు ప్రస్తుతం ఉన్న మున్సిపల్ కార్యాలయానికి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని, తాత్కాలికంగా దరఖాస్తుల స్వీకరణకు బాదేపల్లిలో కౌంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్‌ల నిర్మాణ పనులు

జడ్చర్ల టౌన్: ప్రయాణికుల సౌకర్యార్థం జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్‌ల ఏర్పాటుకోసం నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్లాట్‌ఫాం 1 నుంచి 2, 3 ప్లాట్‌ఫాంలకు వెళ్లేందుకు, అలాగే వాటినుంచి బయటకు వెళ్లేందుకు మొత్తం 3 లిఫ్ట్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయి. రైల్వేస్టేషన్ ఆధునీకీకరణ పనుల్లో భాగంగా ఇప్పటికే ప్లాట్‌ఫాంలను అభివృద్ధి చేశారు. అందులో భాగంగానే ప్లాట్‌ఫాంల వద్ద లిఫ్ట్‌లు నిర్మాణం చేస్తున్నారు. ప్రయాణికులు స్టేషన్‌కు వచ్చి టికెట్ తీసుకుని రెండో, మూడో ప్లాట్‌ఫాం మీదకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ నుంచి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో లిఫ్ట్‌లు నిర్మిస్తున్నారు. ఇవి పూర్తయితే ప్రయాణీకులకు కష్టాలు తీరుతాయి.



రైల్వేస్టేషన్‌లో నిర్మిస్తున్న లిఫ్ట్

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



రైఫిల్ షూటింగ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రాజాపూర్: విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు క్రీడలను సైతం చక్కగా నేర్చుకోవాలని సూచించారు. సోమవారం బాలానగర్ మండల కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలలో... రూ.4 లక్షల ప్రభుత్వ, రూ. 70 వేల దాతల నిధులతో ఏర్పాటు చేసిన రైఫిల్ షూటింగ్ గదిని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేకంగా కృషిచేస్తోందన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా.. ఇష్టపడి చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు కూడా పాఠశాలలో మంచి ఫలితాలు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సౌమ్య, ఫిజికల్ డైరెక్టర్ అరుణ, ఉపాధ్యాయులు, నాయకులు తిరుపతి, శంకర్‌నాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, అరుణ్ కుమార్‌రెడ్డి, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

యేసుక్రీస్తు మార్గంలో నడుద్దాం



భక్తిగీతాలు ఆలపిస్తున్న సేవకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: యేసు క్రీస్తు మార్గంలో నడుద్దామని పాస్టర్ డాక్టర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో రక్షణ దుర్గం, జీసస్ పవర్ అపోస్తలిక్ మినిస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం దైవసేవకుల సహవాసం.. ఉమ్మడి జిల్లా వేదిక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ ప్రమోద్‌కుమార్ ప్రసంగించారు. యేసు క్రీస్తు నిజమైన రక్షకుడని, ఆ ప్రేమతో మనం జీవించాలని, ఐక్యతతో నడుచుకోవాలన్నారు. ప్రభువైన క్రీస్తూ బోధనలతో మంచి, చెడు, విచక్షణ, జ్ఞానం, సమతుల్యత ఉన్న జీవితాలు కలిగి ప్రతి ఒక్కరిని సన్మార్గంలో నడిపించే విధంగా తమ సంఘ పరిచర్యలో ఉండాలన్నారు. ఇతరుల పట్ల ప్రేమ స్వభావంతో ఉండాలన్నారు. మనం ఏమి బోధిస్తున్నామో, ఆ రీతిగా యేసుక్రీస్తూ మాదిరిగా జీవితాలు, ప్రతి ఒక్కరూ నమ్మకం, విశ్వాసంతో ఉండాలని కోరారు. సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పాస్టర్లు హాజరయ్యారు. అనంతరం దైవ సేవకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రానున్న కాలంలో చేపట్టనున్న కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికల గురించి సమావేశంలో చర్చించుకున్నారు. సమావేశంలో జీసస్ పవర్ అపోస్తలిక్ వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి శామ్యుల్, రక్షణ దుర్గం మినిస్ట్రీస్ డీఆర్‌వీ.ప్రసాద్, సేవకులు జాన్సన్‌పాల్, ఆర్.జాన్, ప్రసాద్, జాజల ప్రభాకర్, ప్రసాద్, శ్రీకాంత్, రాబర్ట్, జ్యోతికుమార్, శ్యామ్, శాంసన్, శ్రీధర్, తిమోతి, ఆశీర్వాదం, పీఎ.దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

రైతులంతా బిజీ.. బిజీ..



కారుకొండ సమీపంలో మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న రైతులు

నవాబుపేట: మండలపరిధిలో దాదాపు అన్ని గ్రామాల్లో ఎక్కడ చూసినా రైతులు పొలాల్లో బిజీ.. బిజీగా గడుపుతున్నారు. వరుసగా గత రెండురోజులుగా వర్షాలు కురవడంతో విత్తనాలు నాటేందుకు అనువుగా మారింది. దీంతో రైతన్నలు, కూలీలు ఈ పనులు చేసేందుకు పొలాల బాటపట్టారు. చాలామంది రైతులు మొక్కజొన్న వంటివి సాగు చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే ప్రారంభంలో జొన్నలు వేసిన రైతులు మాత్రం వర్షాలు సరిగా కురవని నేపథ్యంలో.. కాస్త నిరాశలో ఉన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల అందజేత

జడ్చర్ల టౌన్: హైదరాబాద్ లోయర్‌ట్యాంక్ బండ్ వద్ద ఉన్న భారత్ సేవాశ్రమ సంఘం నిర్వాహకులు వెంకటేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో సోమవారం జడ్చర్ల జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. జడ్చర్ల జెడ్పీహైస్కూల్‌తో పాటు, పోలేపల్లి హైస్కూల్, బాదేపల్లి హైస్కూల్, తెలుగు, ఉర్దూమీడియం ప్రాథమిక పాఠశాలలకు చెందిన మొత్తం 1500 మంది విద్యార్థులకు సంఘం తరపున నోట్‌బుక్ అందజేశారు. వెంకటేశ్వరానందస్వామి మాట్లాడుతూ తమ సంఘం పేద విద్యార్థుల కోసం పనిచేస్తోందన్నారు. అందులో భాగంగానే ఈ ఏడాది రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని 64 పాఠశాలల్లో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేసినట్లు వివరించారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, ప్రతినిధి ఓబుల్‌రెడ్డి, లయన్ డా.రాంరెడ్డి, ఎంఈఓ మంజులాదేవి, లయన్ కైలాస్, వార్డుకౌన్సిలర్లు రాజు, ప్రశాంత్‌రెడ్డి, జ్యోతి పాల్గొన్నారు.



జడ్చర్ల జెడ్పీహైస్కూల్‌లో నోట్‌పుస్తకాల పంపిణీ

యువజాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

యువజాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలోని 10 వార్డులో ఉన్న పాఠశాలలో 180మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ వాసుదేవరావు మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లోని 22 పాఠశాలలను దత్తత తీసుకుని నాణ్యమైన విద్య అందించేందుకు కృషిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు మధుసూదన్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు అనురాధ, సువర్ణ, కౌన్సిలర్ శశికిరణ్, పూర్వవిద్యార్థి రాధాకృష్ణ పాల్గొన్నారు.



తుంకినీపూర్‌లో..

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం అదే గ్రామానికి చెందిన మధుయాదవ్, సురేష్‌యాదవ్ సోదరులు విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. అదేవిధంగా తుంకినీపూర్ పాఠశాలలో ఆవుల శేఖర్, హేమలత దంపతులు వారి మేనకోడలు క్రితిక జ్ఞాపకార్థం 45 మంది పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, పలకలు, పెన్నులు, కంపాక్ట్ బాక్సులను అందజేశారు. కార్యక్రమాల్లో ఎంఈఓ రాజేశ్వర్‌రెడ్డి, హెచ్‌ఎం లక్ష్మణ్‌గౌడ్, సీఆర్‌పీ వసంత, గ్రామస్తులు నరేందర్, కురుమూర్తి, మధు, కృష్ణ, నరేష్, సుధాకర్, సతీష్ పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాస్‌లు..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని నందిని మొబైల్స్ నిర్వాహకుడు బుచ్చిబాబు.. సోమవారం స్థానిక స్టేషన్ బజార్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 100 మంది విద్యార్థులకు ప్లేట్లు, గ్లాస్‌లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నర్సిములు, విజయ్, కిషోర్, నరేందర్, మురళి, రజనీ తదితరులు పాల్గొన్నారు.



మూసాపేటలో..



జిల్లాకేంద్రంలో..

పారిశుద్ధ్య పనుల పరిశీలన



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 39, 49వ వార్డుల పరిధిలోని రాజేంద్రనగర్, సద్దలగుండు, పాల్‌సాబ్‌గుట్ట, క్రిస్టియన్‌కాలనీ తదితర ప్రాంతాలలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పారిశుద్ధ్య కార్మికులకు తగు సూచనలిచ్చారు. ఆయా వీధులలోని డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. అనంతరం చెత్త కుప్పలను ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు.

31, 32వ వార్డులలో ఫాగింగ్

ఇదిలాఉండగా సోమవారం రాత్రి పట్టణంలోని 31, 32వ వార్డుల పరిధిలోని వీరన్నపేట, మక్కామసీదు, హీరాబాయితండా, టీడీగుట్ట తదితర ప్రాంతాల్లో దోమల నివారణకు గాను ఫాగింగ్ చేశారు. ప్రత్యేక వాహనం ద్వారా మున్సిపల్ సిబ్బంది ఈ కార్యక్రమం నిర్వహించారు.

మిడ్జిల్ ఎస్‌ఐగా జయప్రసాద్

మిడ్జిల్: మండల ఎస్‌ఐగా జయప్రసాద్‌ను నియమిస్తున్నట్లు ఉన్నత అధికారుల నుంచి సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈమేరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆనంద్‌ను నారాయణపేట్ జిల్లా వీఆర్‌కు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా జయప్రసాద్ గతంలో ఇక్కడ ఎస్‌ఐగా విధులు నిర్వహించడం గమనార్హం.